క్లుప్తంగా

28న తైబజారు వేలం

పెద్దకొత్తపల్లి: ఈనెల 28వ తేదీన పెద్దకొత్తపల్లి సంతలో మేకలు, గొర్రెల తైబజారును వసూలు చేసుకునేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి నాగశేషి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు తైబజారుకు రూ.20 వేలు, గొర్రెలు, మేకలకు రూ.20 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని వారు సూచించారు.

మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



బిజినేపల్లి: మండల కేంద్రంలోని చెరువులో మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలను జిల్లా మత్స్యశాఖ జిల్లా అధికారి లక్ష్మప్ప సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. ఈ పరీక్షలో 85 మంది పాల్గొన్నారని మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడు అల్లోజీ వివరించారు. మధు, బాలస్వామి, తిరుపతయ్య, ఆంజనేయులు, చంద్రయ్య, పెంటయ్య పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరంలో ఉగాది పండుగ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ తిరుపాటి నాగరాజు బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉగాది సందర్భంగా గ్రామాల్లో రకరకాల ఆటలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు బండలాగుడు పోటీలను శుక్రవారం నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో 10 జతల వృషభాలు పాల్గొన్నాయన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

అచ్చంపేట రూరల్: సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తూ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాల కోసం ప్రభుత్వం జీఓ 11 విడుదల చేయడంపై శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు

లింగాల: మండల పరిధిలోని దత్తారానికి నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు పనులకు శుక్రవారం సర్పంచ్ జంగమ్మ ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన రూ. 7 లక్షలతో రెండు వార్డులలో రోడ్లు వేయిస్తున్నట్లు ఆమె తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో రాములు, సురేష్‌గౌడు, భూపతిరావు, హుస్సేన్, బాల్‌చందర్, వీరస్వామి, నిరంజన్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచే విధంగా క్షేత్రసహాయకులు కృషి చేయాలని ఎంపీడీఓ గంగమోహన్ కోరారు. శుక్రవారం మండలంలోని లచ్చిరాం తండా, ఐతోలు, ఇంద్రకల్‌లలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు.

కరపత్రాల విడుదల

అచ్చంపేట రూరల్: కుల నిర్మూలనే ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదికల లక్ష్యమని జై భారత్ జైహో రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మేశ్వర్ అన్నారు. ఈనెల 26న సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర సభలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమంలో కాశీం, పవన్, అంజి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నాగర్‌కర్నూల్ క్రైం: గతేడాది ఎంజేఆర్ ట్రస్ట్ సహకారంతో రెడ్‌క్రాస్ నిర్వహించిన రక్తదాన శిబిరంలో అత్యధికంగా 1,866 యూనిట్ల రక్తాన్ని సేకరించి రాష్ట్రంలో పలు బ్లడ్‌బ్యాంకులకు అందజేసినందుకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అభినందించి ఎమ్మెల్యేకు మెమోంటో అందజేశారు. ఈ మెమోంటోను శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెడ్‌క్రాస్ సభ్యులు ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ రమేష్ రెడ్డి, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ డి.కుమార్, కృష్ణారావు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను విడుదల చేయాలి

కొల్లాపూర్: తీన్మార్ మల్లన్నను వెంటనే విడుదల చేయాలని కోరుతూ క్యూ న్యూస్ ప్రతినిధి అవుట రాజశేఖర్ శుక్రవారం తహసీల్దార్ రమేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. మల్లన్నను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని ఆయన ఆరోపించారు. అక్రమంగా అరెస్టుచేసిన మేడిపల్లి పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వరిదేలలో వడ్డెర సంఘం జెండా ఆవిష్కరణ

కొల్లాపూర్: పట్టణంలోని వరిదేలలో వడ్డెర సంఘం జెండాను ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల మద్దిలేటి శుక్రవారం ఎగురవేశారు. తెలంగాణ వడ్డెర సంఘం, చారిటబుల్ ట్రస్టును స్థాపించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వారు జెండాను ఆవిష్కరించారు. ఎల్లయ్య, సత్యం, కురుమూర్తి, శివుడు, కృష్ణయ్య, గోవుల మద్దిలేటి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



లింగాలలో పోషకాహారంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సభ్యులు

లింగాల: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్య చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, గిరిజ తెలిపారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కిశోర్ బాలికలు త్వరగా జీర్ణమయ్యే చిరుధాన్యాలు, తృణధాన్యాలు తీసుకోవడంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని సూపర్‌వైజర్లు తెలిపారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్ పాల్గొన్నారు.

మన్ననూర్: జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ అచ్చంపేట ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. శుక్రవారం అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లిలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సీడీపీఓ దమయంతి పోషణ పక్వాడా, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో కిషోర బాలికల్లో రక్త హీనత సమస్య వచ్చే అవకాశం ఉండదన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకొని వ్యాధులను దూరం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమాదేవి, సూపర్‌వైజర్లు సువర్ణ, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అమృతమ్మ, బీపాష విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ మల్లేష్, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



జంగంరెడ్డిపల్లిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ దమయంతి

అచ్చంపేట రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి కోరారు. శుక్రవారం పట్టణంతోపాటు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చిరు ధాన్యాల ప్రాధాన్యత, రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ కమల, సూపర్‌వైజర్లు రాజేంద్ర, విజయ, మణెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జనచైతన్య యాత్ర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్‌రూరల్: బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనచైతన్య బస్సు యాత్రకు మద్దతు ఇవ్వాలని శుక్రవారం సీపీఎం నాయకులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిని ఆహ్వానించారు.

తెలకపల్లి: జనచైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 28న జిల్లాలో జరిగే జనచైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బల్మూర్: జన చైతన్య యాత్రకు పార్టీ కార్యకర్తలు, కార్మికులు, పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్ కోరారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

కోడేరు: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు.

తాడూరు: మండల కేంద్రంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బయలు దేరిన జన చైతన్య యాత్ర వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

ఘనంగా 'వరల్డ్ వాటర్‌డే'

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో శుక్రవారం వరల్డ్ వాటర్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ నీటి వనరులు, ఆదా చేయాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

లింగాల: మనిషి మనుగడకు నీరు ఎంతో అవసరమని, నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్, సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, ముజీబ్, వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎం తాహెర్‌పాష న్నారు.



అంబట్‌పల్లిలో విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న చైర్మన్, హెచ్‌ఎం

ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు టీఎన్‌జీఓ కృషి

కొల్లాపూర్: ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం టీఎన్‌జీఓ చేస్తున్న కృషి అభినందనీయమని ఆర్డీఓ హనుమనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో టీఎన్‌జీఓ టేబుల్ క్యాలెండర్, డైరీల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓతో పాటు తహసీల్దార్ రమేష్ నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసులు, డాక్టర్ జయచంద్రప్రసాద్ యాదవ్, టీఎన్‌జీఓ జిల్లా సహ అధ్యక్షుడు పసుల సత్యనారాయణ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ అధ్యక్ష, కార్యదర్శులు జీకే.వెంకటేష్, ఏ.సురేందర్, కోశాధికారి నాగరాజు, సహ అధ్యక్షుడు గణేష్‌బాబు, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌చంద్, శోభారాణి, ప్రచార కార్యదర్శి దాసరి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి జంబులు, నర్మద తదితరులున్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

తాడూరు: మండలంలోని సిర్సవాడలో కంటి వెలుగు ఉచిత శిబిరాన్ని సర్పంచ్ రాజేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 28 మందికి ఆపరేషన్ అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు వైద్యాధికారి డాక్టర్ ఇస్మాయిల్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాములు, సిబ్బంది శ్రీనివాసులు, శ్రావణ్, శారద, పారిజాత పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మనోహర పిలుపునిచ్చారు. శుక్రవారం మండంలోని ఎల్లికల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయులు, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, సర్పంచ్ బాలస్వామి పాల్గొన్నారు.



కంటి వెలుగును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

రాహుల్‌గాంధీ ఎంపీ అనర్హత వేటుపై నిరసన

ఉప్పునుంతల: రాహుల్‌గాంధీపై ఎంపీ అనర్హత వేటును నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ మేరకు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెల్టూరి రేణయ్య, యువజన కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, ప్రహ్లాద్, తిర్పతయ్యగౌడ్, వార్డు సభ్యులు భాస్కర్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీను, లక్ష్మయ్య, నిరంజన్, అశోక్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు జాగ్రత్తలు



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉప్పునుంతల: ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సం పురస్కరించుకొని శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్వప్న క్షయవ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి ఎడతెరిపి లేకుండ దగ్గు, సాయంత్రం జ్వరం, చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో ఫార్మసిస్టు శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ప్రభావతి, ఏఎన్‌ఎం దేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీను పాల్గొన్నారు.



బల్మూర్‌లో క్షయ నివారణ ర్యాలీ చేపడుతున్న ఆరోగ్య సిబ్బంది

బల్మూర్: క్షయ వ్యాధి నిర్మూలనకు ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని డాక్టర్ ప్రశాంతి కోరారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ కుమారాచారి, పీహెచ్ఎన్ శాంతబాయ్, సిబ్బంది మల్లేష్, డాక్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా మండలంలోని పాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వర్ గ్రామంలోని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గజవర్ధనమ్మ, గోవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

కత్తెరతో వ్యక్తి దాడి.. రిమాండ్

బిజినేపల్లి: మండలంలోని బోయాపూర్‌కి చెందిన దాసర్ల వెంకటయ్య అదే గ్రామానికి చెందిన విష్ణుపై గురువారం ఉదయం ఆస్తి తగాదాల విషయంలో గొడవపడి కత్తెరతో దాడి చేసి గాయపర్చాడు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి కేసు నమోదు చేశారు. దాడి చేసిన వెంకటయ్యను శుక్రవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో శుక్రవారం చీమర్ల నిరంజన్‌పై అదే గ్రామానికి చెందిన కొమిరె కుర్మయ్య దాడిచేసి గాయపర్చినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఇంటి పక్కన బాట విషయంలో తరుచుగా గొడవపడే కుర్మయ్య అక్కడ బోరు వేయిస్తుండగా అడ్డుకోగా దాడిచేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

నిఖిత మృతిపై న్యాయ విచారణ జరపాలి



అచ్చంపేట రూరల్: నిఖిత మృతిపై న్యాయ విచారణ జరపాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. నిఖిత మృతి కారకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి నాల్గో రోజుకు చేరింది. ఈ మేరకు ఎంఎస్ఎఫ్ నాయకులు మద్దతు పలికి దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీశ్వర్, సైదులు, పవన్, ఆంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

నీటి ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ



పెంట్లవెల్లి: మండల పరిధిలోని కొండూరులో ప్రభుత్వ పాఠశాలలో నీటి ట్యాంక్ నిర్మాణం కోసం ఆ గ్రామ సర్పంచ్ నల్లపోతుల గోపాల్ శుక్రవారం కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నీటి ట్యాంక్, కంపౌండ్ వాల్, మరుగుదొడ్లు, వంటగది షెడ్ వంటి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, ప్రధానోపాధ్యాయులు రమేశ్ నాయక్, పాఠశాల చైర్మన్ ఎల్లగౌడ్, యాదగిరి, వరలక్ష్మి పాల్గొన్నారు.

సామూహిక మరుగుదొడ్లను ప్రారంభించాలి

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను వెంటనే ప్రారంభించాలని కోరుతూ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ రాజయ్యకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం వారు కమిషనర్‌ను కలిశారు. మరుగుదొడ్లు నిర్మించి సంవత్సర కాలం అవుతున్నా ఇంకా ప్రారంభం మాత్రం చేయడం లేదన్నారు. వెంటనే వాటిని ప్రారంభించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాకి సత్యనారాయణగౌడ్, నాయకులు ఎల్లయ్యయాదవ్, శివకృష్ణ యాదవ్, ఇరగదిండ్ల మద్దిలేటి, నవీన్‌కుమార్ ఉన్నారు.

బహుమతుల ప్రదానం

కోడేరు: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు సహకారంతో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు మిద్దె శాంతయ్య తెలిపారు. మొదటి బహుమతి పెద్దకొత్తపల్లి మండలం గెలుపొందగా రూ.15వేలు, ద్వితీయ బహుమతి నాగులపల్లి జట్టు రూ.10వేలు గెలుచుకున్నారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి

తెలకపల్లి: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త బి.పుష్పావతి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈదుల నరేందర్‌రెడ్డి, ఏఓ సందీప్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దూరులో పాలెం వ్యవసాయ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి సమస్యలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లింగమయ్య, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, సుమలత, సరిత, సర్పంచ్ శైలజ, ఉపసర్పంచ్ చంద్రయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ఏఓ సందీప్‌కుమార్, ఏఈఓ రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులు, గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న శాస్త్రవేత్త పుష్పావతి

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

అచ్చంపేట రూరల్: రాహుల్‌గాంధీ ఎంపీ పదవి అనర్హత వేటు వేసినందుకు నిరసనగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాశన్నయాదవ్, హరిశ్చంద్ర, రామనాథం, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి అనర్హత వేటు వేయడం వంటి బీజేపీ దుర్మార్గ పాలనను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అమ్రాబాద్‌లో ఆ పార్టీ నాయకులు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోది దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినారాయణ, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు సంతోష్, లడ్డు యాదవ్, లాలయ్యగౌడ్, వెంకటేష్, అశోక్ పాల్గొన్నారు.



అమ్రాబాద్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భక్తిభావంతో మెలగాలి

కల్వకుర్తిరూరల్: ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని హరిహర టౌన్‌షిప్, ఎల్లికల్‌తండాలోని ఆంజనేయ స్వామి దేవాలయ మరమ్మత్తులకు సహకరిస్తామన్నారు. ఎల్లికల్ తండా ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తండా ప్రజలకు అండగా ఉంటామన్నారు. హరిహర టౌన్‌షిప్‌లో ఆంజనేయ స్వామి దేవాలయంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో రూపొందించిన పంచాంగాన్ని ఆవిష్కరించారు. లయన్స్ క్లబ్ సేవలు విభిన్న వర్గాలకు అందిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేశ్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌కి సాటిలేదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్, వెంకటేశ్వర్లు, కర్ణాకర్‌రెడ్డి, వేణుగోపాల్, యాదయ్య, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను విడుదల చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఏయిడెడ్ పాఠశాలల జీతాలు, కాంట్రాక్ట్ అధ్యాపకుల జీతాలు, పీఆర్‌సీ బకాయిలు, సరెండర్ లీవ్ బిల్లులు, పెన్షనర్ బెనిఫిట్స్ బిల్లులు మంజూరైన అందని పరిస్థితి నెలకొందని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు ఆర్.కృష్ణ ఆరోపించారు. శుక్రవారం పెండింగ్ జీతాలను ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేస్తూ డీటీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

కందనూలు: నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జలాల్ శివుడు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎదిరేపల్లి శ్రీనివాసులు, కడ్తాల కృష్ణయ్య, సి.చందు, టౌన్ అధ్యక్షుడు ఎలిమే రాము, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, టౌన్ ఉపాధ్యక్షుడు రవీంద్ర చారి, టౌన్ ఓబీసీ మోర్చా ప్రెసిడెంట్ లక్ష్మయ్య ఉన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

తాడూరు: పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలంటూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రాధకు వినతిపత్రం అందజేశారు.

వెల్దండ: మండలంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం ఇచ్చారు.

ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేయడం తగదు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడానికి ఇది రాచరిక పరిపాలన కాదని బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పిడికిళ్ల శ్రీనివాసులు, కాళ్ల నిరంజన్ అన్నారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ వ్యవహారంలో నిందితులకు సహకరించిన తెర వెనక ఉన్న పెద్దలను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విపక్ష పార్టీల నాయకులు కోరారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి, బండి సంజయ్, తీన్మార్ మల్లన్నలపై సిట్ ద్వార నోటీసులు ఇప్పించడం తగదని అన్నారు. కార్యక్రమంలో కుంభం మల్లేశ్‌గౌడ్, పబ్బతి శ్రీనివాసులు, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ల నిరసన

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని, తూతూ మంత్రంగా కౌన్సిల్ సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌరీశంకర్, శ్రీనివాసులు, సునీతారెడ్డి, నూరీ భేగం, చిట్టెమ్మ, సంధ్య పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

ఉత్తమ పంచాయతీలకు అవార్డుల ప్రదానం



అవార్డు పొందిన సర్పంచ్‌లతో ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీలకు దీన్‌దయాల్ ఉత్తమ అవార్డులను ఎంపీపీ విజయ అందజేశారు.

పెద్దకొత్తపల్లి: సర్పంచ్‌ల సేవలు గ్రామాలకు ఎంతో అవసరమని ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్ అన్నారు. మండలంలోని 25 గ్రామపంచాయతీలకు 13 మంది సర్పంచ్‌లకు అవార్డులు రావడం గర్వకారణం అన్నారు.

ఊర్కొండ: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ రాధ అన్నారు. శుక్రవారం జాతీయ అవార్డుల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని బొమ్మరాశిపల్లికి వచ్చిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జాతీయ పంచాయతీ పురస్కార్ అవార్డులను ఎంపీపీ, ఎంపీడీఓలు సర్పంచ్ లక్ష్మమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కల్మిచర్ల గోపాల్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ఘనంగా 'సాక్షి' వార్షికోత్సవం

అచ్చంపేట రూరల్: సాక్షి దినపత్రిక ఆవిర్భవించి 15 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా సాక్షి వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నరసింహగౌడ్, కౌన్సిలర్లు కేక్‌ను కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో సాక్షి అచ్చంపేట ఆర్సీ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, రిపోర్టర్ సాయిబాబు, కౌన్సిలర్లు గౌరీశంకర్, శివ మనోహర్ ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కేకు తినిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరసింహగౌడ్

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం

అచ్చంపేట రూరల్: పట్టణంలో అందరి సహకారంతో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుందామని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నరసింహ గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్ శైలజావిష్ణువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు, కమిషనర్ బాలరాంనాయక్, మేనేజర్ అనిత, ఏఈ అబ్దుల్ షబ్బీర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్వింటా వేరుశనగ రూ.7,651

కల్వకుర్తి: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ వేరుశనగకు రూ.7,651 ధర లభించింది. శుక్రవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌కు 116 మంది రైతులు 3,052 బస్తాల్లో 916 క్వింటాళ్ల వేరుశనగను అమ్మకానికి తీసుకొచ్చారు. మధ్యస్తంగా రూ.7,121, కనిష్టంగా రూ.5,001 ధర లభించింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు మార్కెట్ కార్యదర్శి భగవంత్ తెలియజేశారు.